సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 24 । జనవరి । 2025



పత్తాలేని మెరైన్ పోలీస్‌స్టేషన్

నరసాపురం తీరప్రాంతంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు అంశం పత్తా లేకుండా పోయింది. సర్వే చేసి కేంద్రం దృష్టిలో పెట్టినా ముందుకు కదలని పరిస్థితి. IIలో ▸



జీరో టిల్లేజ్‌తో మేలు

జీరో టిల్లేజ్‌తో మొక్కజొన్న సాగు వల్ల అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సమయం, ఖర్చు ఆదా అవుతాయంటున్నారు. IIలో ▸



యువకుడి దుర్మరణం

హనుమాన్ జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. లారీని బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. IIలో ▸

సచివాలయాలపై కుట్ర

ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల విధులకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పనులు చేయిస్తోంది. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా రేషనలైజేషన్ పేరిట వారి సర్దుబాటుకు ప్రయత్నాలు చేస్తోంది.

సాక్షి, భీమవరం: ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం ప్రజలు వ్యయప్రయాసల కోర్చి మండల, జిల్లా కేంద్రాలకు రావాల్సిన పనిలేకుండా గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 2 వేలు, పట్టణ ప్రాంతాల్లో 4 వేల జనాభా ప్రాతిపదికన జిల్లాలోని రూరల్ ఏరియాల్లో 398, అర్బన్‌లో 137 సచివాలయాలను ఏర్పాటుచేసింది. గతంలో మాదిరి సిబ్బంది కొరత, అధికారులు అందుబాటులో లేక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్ తదితర పోస్టులను నియమించింది. ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులు పనిచేసేవారు. సచివాలయానికి వెళితే చాలు అన్ని పనులు జరిగేలా 500లకు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆయా సేవలను బట్టి తక్షణ పరిష్కారం, కొన్ని 72 గంటలు, మరికొన్ని వారం నుంచి రెండు వారాల వ్యవధిలో పరిష్కరించేలా టైంబాండ్ సైతం పెట్టింది. కేవలం దరఖాస్తు చేసుకున్న గంటలోనే రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరుచేసిన సచివాలయాలు ఎన్నో ఉన్నాయి.

- సేవల నిర్వీర్యానికి ఎత్తుగడ
- ఇప్పటికే సచివాలయ ఉద్యోగులతో ప్రత్యామ్నాయ పనులు
- ఖాళీ పోస్టుల భర్తీకి మంగళం
- రేషనలైజేషన్ ద్వారా ఉద్యోగుల సర్దుబాటుకు యత్నాలు
- జిల్లాలో 535 గ్రామ, వార్డు సచివాలయాలు
- 1,414 ఖాళీ పోస్టుల భర్తీ ప్రశ్నార్థకం



సచివాలయ భవనం

కూటమి వచ్చాక సంబంధం లేని పనులు

గతంలో నవరత్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతిఒక్కరి గడప చెంతకు చేరేలా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగులు పని చేసేవారు. కాగా సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో జాబ్‌చార్ట్‌లో లేనిపనులు చేయిస్తూ వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. వలంటీర్ల పనులను చేయిస్తూ పనిభారం మోపింది. హౌస్‌హోల్డ్, ఎంఎస్ఎం తదితర సర్వేల పేరిట తిప్పుతోంది. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సొంత సర్వేలకు సచివాలయ ఉద్యోగులను వినియోగించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. సచివాలయాల భవనాలను వేరే కార్యాలయాలకు వినియోగించే ప్రక్రియ ఇప్పటికే జిల్లాలో మొదలైంది. పాలకోడేరులోని సచివాలయం-1 భవనాన్ని ఖాళీ చేయించి తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు.

జిల్లాలో సచివాలయాలు	
గ్రామ సచివాలయాలు	398
ఉండాల్సిన ఉద్యోగులు	4,179
ప్రస్తుతం పనిచేస్తున్నవారు	3,104
ఖాళీల సంఖ్య	1,075
వార్డు సచివాలయాలు	137
ఉండాల్సిన ఉద్యోగులు	1,438
ప్రస్తుతం పనిచేస్తున్నవారు	1,099
ఖాళీల సంఖ్య	339

ఉద్యోగులపై కత్తి

జిల్లాలో 535 సచివాలయాలకు గాను 4,203 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా 1,414 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వంలోనే ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా ఎన్నికల రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం వీటిని భర్తీ చేయకుండా హేతుబద్ధీకరణ పేరిట ఉద్యోగుల కుదింపునకు ప్రయత్నాలను ప్రారంభించింది. 3,500 జనాభా పైబడిన సచివాలయాల్లో ఎనిమిది మంది, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న చోట ఏడుగురు, 2,500 లోపు జనాభా ఉన్నచోట ఆరుగురు ఉద్యోగులను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఖాళీలు ఉన్నచోట మిగిలిన వారితో సర్దుబాటు చేయనుంది. సగటున ఏడుగురు ఉద్యోగులను తీసుకున్నా జిల్లాలో 458 మంది ఉద్యోగులకు స్థానం చలనం కలిగే అవకాశం ఉంది. తద్వారా ఖాళీ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం ఎసరు పెడుతోంది. సచివాలయ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం వేచిచూస్తున్న నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యిందని పలువురు అంటున్నారు. ఇదిలా ఉండగా హేతుబద్ధీకరణ నిర్ణయంతో ఉన్న వారిపై పనిభారం మరింత పెరిగిపోతుందని సచివాలయ ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో రూ.30 లక్షలతో పనులు



సాక్షి స్పందన

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామనీ, భద్రతా చర్యల మెరుగుకు చర్యలు చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు. 'సాక్షి'లో గురువారం 'జీజీహెచ్‌లో భద్రతపై ఆందోళన' శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో భద్రతా చర్యలపై సమీక్షించిన సూపరింటెండెంట్ రాజు ప్రత్యేక చర్యలకు ఉపక్రమించారు. ఆస్పత్రి ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.30 లక్షలతో పనులు

జీజీహెచ్‌లో సీసీ కెమెరాల పనితీరును మరింత పెంచటంతోపాటు అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామనీ, హాస్పిటల్ ప్రాంగణంలో చీకటి లేకుండా వీధి దీపాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు డీఎంఈకు పంపామని సూపరింటెండెంట్ రాజు తెలిపారు. ఈ మేరకు పనులకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటుకు సుమారు రూ.7.33 లక్షలు, అత్యాధునిక సీసీ కెమెరాలు, సర్వైలెన్స్ సిస్టమ్ ఏర్పాటుకు రూ.16.50 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించామని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

సైన్స్ పోటీలతో శాస్త్రీయ ఆలోచనలు



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈఓ నారాయణ

భీమవరం: సైన్స్ ప్రయోగ పోటీల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సైన్స్‌పై అభిరుచి పెంపొందించవచ్చని డీఈఓ ఈ.నారాయణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు మాట్లాడుతూ పోటీలు ప్రారంభమయ్యాయని, వచ్చేనెల 15 వరకు కొనసాగుతాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిర అభివృద్ధి, మూఢనమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అంశాల్లో పోటీలుంటాయన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో వచ్చేనెల 1 నుంచి క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ టీ కప్పుల నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. పట్టణాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. తొలి అడుగుగా కలెక్టరేట్‌లో వాటర్ బాటిల్స్, డిస్పోజబుల్ ప్లేట్లు, టీ గ్లాసుల స్థానంలో స్టీల్ సామగ్రిని వినియోగిస్తున్నామన్నారు. వచ్చేనెల నుంచి పట్టణంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ టీ గ్లాసులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని కలెక్టర్ హెచ్చరించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బదిలీ



సి.పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను మంగళగిరిలోని ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి డైరెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పురుషోత్తంకుమార్ స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో ఏలూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జిగా పనిచేస్తున్న సునీల్‌కుమార్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

స్టీల్‌ప్లాంట్‌కు నిధులు

భీమవరం: రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించి విశాఖలోని స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. గురువారం భీమవరంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీలో రూ.10,300 కోట్లు క్యాపిటల్ షేర్స్‌గా, రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించినట్టు వివరించారు. మేనేజ్‌మెంట్‌లో లోపాలను సరిచేసుకుని నడపాలని, ప్యాకేజీలో ఉద్యోగులు, కార్మికుల జీతాల చెల్లింపునకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఏం మాట్లాడుతోందో ఆమెకే స్పష్టత లేదని మంత్రి ఎద్దేవా చేశారు.

బాలికల హక్కులను కాపాడాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు (టూటౌన్): బాలికల హక్కులు కాపాడటం అందరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రో చైల్డ్ గ్రూప్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. బాలికల బంగారు భవిష్యత్తు కోసం వారి భద్రత ఆరోగ్యం విద్యపై ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జేసీ కోరారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతల రమేష్‌బాబు, కోశాధికారి జాగర్లమూడి శివకృష్ణ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు న్యాయవాది చిక్కా భీమేశ్వర తదితరులు పాల్గొన్నారు.

కళలు సంస్కృతిలో భాగం

ఉండి: కళలు, కళాకారులను గౌరవించడం, వారిని ప్రోత్సహించడం మన సంప్రదాయమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మండలంలోని కోలమూరులో సంతాన గోపాలస్వామి ఆలయం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలను బుధవారం అర్ధరాత్రి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ఆదరించాలని, జాతరలు, ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో నాటకాలు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం సురభి నాట్యమండలి ప్రధాన కళాకారుడు ఆర్.వేణుగోపాలరావును కేంద్రమంత్రి సత్కరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిచర్ల సుభాష్‌రాజు పాల్గొన్నారు. నాటకోత్సవాల్లో చివరిగా గురువారం రాత్రి శ్రీనివాసకల్యాణం అనే నాటకాన్ని ప్రదర్శించారు. కేంద్ర మంత్రిని నిర్వాహకులు సత్కరించారు.



కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న దృశ్యం

సాహిత్యంతో సమాజ హితం

భీమవరం(ప్రకాశం చౌక్): సమాజ హితాన్ని కోరేది సాహిత్యమని, సాహిత్యానికి కులమతాలు ఉండవని పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన, విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో భీమవరం త్యాగరాజ భవనంలో కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 80వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు డాక్టర్ ఉమర్ ఆలీషా పురస్కారం, రూ.50,116 నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ సాహితీ సమితి ద్వారా భీమవరంలో 32 ఏళ్లుగా విశిష్ట కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భీమవరం వేదికగా సాహిత్య రంగంలో రాణిస్తున్న వారికి ఉమర్ ఆలీషా పురస్కారం అందిస్తున్నారన్నారు. చిన్నతనంలోనే సాహితీ సేవను ప్రారంభించిన మహనీయులు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా అని చెప్పారు. సమితి కార్యదర్శి దాయన సురేష్ చంద్రాజీ, ఉపాధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఆచార్య బేతవోలును సత్కరిస్తున్న దృశ్యం

జేఈఈ మెయిన్స్‌కు 570 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరులో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు రెండో రోజు గురువారం 570 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 178 మంది, మధ్యాహ్నం 180 మందికి 179 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 112 మందికి 106 మంది, మధ్యాహ్నం 107 మందికి 107 మంది హాజరయ్యారు.

రైతుకు ఎరువు దరువు

ధరల మోత.. రైతుకు వాత
- కాంప్లెక్స్ ఎరువుల ధరలకు రెక్కలు
- బస్తాకు రూ.50 నుంచి రూ.230 వరకు పెంపు
- జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు
- రైతులపై రూ.11.10 కోట్ల మేర అదనపు భారం



సాక్షి, భీమవరం: ఖరీఫ్ కలిసిరాక.. దాళ్వా పెట్టుబడులకు సొమ్ములకు ఇప్పటికే సతమతమవుతున్న రైతులపై కాంప్లెక్ ఎరువుల ధరల భారం పడింది. కాంప్లెక్ ఎరువుల బస్తా (50 కిలోలు) ధరలు రూ.50 నుంచి రూ.230 మేర పెరగడంతో జిల్లాలో రైతులపై రూ.11.10 కోట్ల మేర అదనపు భారమవుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే రబీలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎకరాకు నాలుగు బస్తాలు వరకు రెండు మూడు రకాల కాంప్లెక్స్ ఎరువులు, రెండు బస్తాల యూరియా, అర బస్తా వరకు పొటాష్ వినియోగిస్తుంటారు. జిల్లాలోని 2.22 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తుండగా 80 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో సుమారు 44.4 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమవుతాయని అంచనా.

ఎరువుల ధరలు (50 కిలోల బస్తా)		
రకం	పాత ధర	కొత్త ధర
10:26:26	రూ.1,470	రూ.1,700
14:35:14	రూ.1,700	రూ.1,800
20:20:013	రూ.1,250	రూ.1,300

అ'ధన'పు భారం

డీఏపీ, యూరియా ధరల్లో మార్పులు లేకపోయినా కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు పెంచేశాయి. రానున్న సీజన్‌లో డీఏపీ రూ.200లకు పైగా పెరగనున్నట్టు తెలుస్తోంది. రబీలో ఎక్కువగా వినియోగించే 10:26:26 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.230లు పెరగ్గా, 14:35:14 బస్తా రూ.100లు, 20:20:013 బస్తా రూ.50లు వరకు పెరిగాయి. ఎకరాకు రూ.500ల వరకు రైతులపై అదనపు భారం పడుతోంది.

భరోసానివ్వని కూటమి : వర్షాలు, వరదలు, ప్రతికూల వాతావరణం, చివరిలో దళారుల దోపిడీతో గత ఖరీఫ్ పంట రైతులకు కలిసిరాలేదు. చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి. మరోపక్క కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు సాయం కొరవడింది. ఏడాది రూ.20 వేలు ఇస్తామంటూ సూపర్ సిక్స్‌లో ప్రకటించిన అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వలేదు. ఖరీఫ్ నష్టపోయిన రైతులకు కనీసం బీమా పరిహారం అందించకపోగా ఈ రబీ నుంచి ఎకరాకు రూ.615 చొప్పున జిల్లా రైతులపై మొత్తంగా రూ.13.65 కోట్ల బీమా ప్రీమియం భారాన్ని మోపింది. పంట పెట్టుబడులకు రైతుల దగ్గర డబ్బుల్లేక దాళ్వా సాగులో తీవ్ర జాప్యమవుతోంది. ఈ తరుణంలో కాంప్లెక్స్ ఎరువుల ధరల పెరుగుదల గుబులు పుట్టిస్తోంది. పెరిగిన ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చినట్టు ఎరువుల కంపెనీల డీలర్లు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వాతావరణం కలిసిరాక ఇబ్బందులు పడుతుంటే ఈ ధరల పెంపుతో రైతులపై అదనపు భారం పడుతోంది. రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. ఎరువుల ధరలను అందుబాటులో ఉంచాలి.

–వర్లపాటి సుధాకర్, వద్దిపర్రు

ఎలాంటి సహకారం లేదు



ఐదేళ్లపాటు ఎంతో ఉత్సాహంగా వ్యవసాయం చేశాం. అధిక దిగుబడులు సాధించాం. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదు. విద్యుత్ బిల్లులు, ఎరువుల ధరల పెంపు కుంగదీస్తోంది. వరి సాగుపై రైతులకు నిరాశ మొదలైంది.

– వెలగల జగ్గిరెడ్డి, పంపనవారిపాలెం, పెనుమంట్ర మండలం

సంక్రాంతి బండి.. ఆదాయం దండి

- ఆర్టీసీకి రూ.99.51 లక్షల రాబడి
- 10 రోజులు.. 434 ప్రత్యేక సర్వీసులు
- గతేడాది కంటే రూ.29 లక్షలు అధికం



భీమవరం(ప్రకాశం చౌక్): సంక్రాంతి ప్రత్యేక సర్వీసుల ద్వారా పశ్చిమ ఆర్టీసీ గణనీయమైన ఆదాయం గడించింది. 10 రోజుల్లో రూ.99.51 లక్షల రాబడి వచ్చింది. జిల్లాలోని నాలుగు డిపోల్లో మొత్తంగా 434 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. ఈనెల 9 నుంచి 12 వరకు, పండుగ తర్వాత 15 నుంచి 20 తేదీ వరకు ఈ సర్వీసులు నడిచాయి. సాధారణ చార్జీలనే వసూలు చేయడంతో ఆదరణ బాగుంది. జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా, సూపర్ లగ్జరీ, ఇంద్ర బస్సులను నడిపారు. ఆయా బస్సులను బట్టి రూ.710 నుంచి రూ.930 చార్జీలు ఉన్నాయి. ఇలా ప్రైవేట్ ట్రావెల్స్ అధిక చార్జీల దోపిడీకి చెక్ పెట్టారు.

2022 నుంచి.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022 నుంచి సంక్రాంతికి ఆర్టీసీ ఆదాయం పెరుగుతూ వస్తోంది. ప్రత్యేకంగా సంక్రాంతి సర్వీసులకు సాధారణ చార్జీలను వసూలు చేయాలని అప్పటి సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇదే నిర్ణయాన్ని ఇప్పటి ప్రభుత్వం అమలు చేస్తోంది. సంక్రాంతికి జిల్లాలో 2022లో రూ.36.88 లక్షలు ఆదాయం రాగా, 2024లో రూ.70 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది గతేడాది కంటే రూ.29 లక్షలకు పైగా అధిక ఆదాయం లభించింది.

భీమవరం ఫస్ట్ : ఈనెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.42,98,000, పండుగ తర్వాత ఈనెల 15 నుంచి 20 వరకు రూ.56,52,000 మొత్తంగా రూ.99,51,000 ఆదాయాన్ని ఆర్టీసీ ఆర్జించింది. భీమవరం డిపో రూ 37.73 లక్షలతో ప్రథమ స్థానంలో నిలిచింది.

డిపో	బస్సులు	ఆదాయం (రూ.లలో)
భీమవరం	164	37,73,911
తాడేపల్లిగూడెం	59	13,26,202
నరసాపురం	103	25,12,625
తణుకు	108	23,38,429

ఆదరణ బాగుంది



సంక్రాంతి ప్రత్యేక సర్వీసులకు ఆదరణ బాగుంది. హైదరాబాద్‌కు పండుగ ముందు, తర్వాత ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశాం. పెద్ద ఎత్తున ప్రజలు కుటుంబ సమేతంగా జిల్లాకు తరలివచ్చారు. ప్రజలు ఆర్టీసీ సేవలను బాగా ఉపయోగించుకున్నారు.

– ఎన్‌వీఆర్ వరప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి

ట్రావెల్స్ బస్సులో మంటలు

తప్పిన పెను ముప్పు

ఏలూరు టౌన్ : గురువారం రాత్రి 9 గంటల సమయం.. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోకి వచ్చిన ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే అగ్నికీలలు తీవ్రం కావటంతో బస్సులోని ప్రయాణికులంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు.. ఏలూరు నగరంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకోవటంతో పెను ప్రమాదం తప్పిందని, జాతీయ రహదారిపై రన్నింగ్‌లో మంటలు చెలరేగితే పెను విపత్తు జరిగేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికులను ఎక్కించుకుని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రారంభమైన మార్నింగ్ స్టార్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఏలూరు పాత బస్టాండ్ వద్దకు వచ్చేసరికి బస్సు వెనుకపక్కన ఉన్న ఇంజిన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. రాజమహేంద్రవరం నుంచి బెంగళూరు వెళ్లే ఏపీ 07 టీటీ 3333 నంబర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఏలూరు చేరుకున్న తర్వాత ఈ ఘటన జరిగింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. దీంతో ప్రయాణికులంతా బయటికి వచ్చేశారు. ఏలూరు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి క్షణాల్లో చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఏవిధమైన నష్టం లేకుండా అగ్నిప్రమాదం నుంచి బయట పడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. బ్యాటరీలో సాంకేతిక సమస్య కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పిన తర్వాత బస్సు యథావిధిగా ప్రయాణికులతో వెళ్లిపోయింది.



ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు పెదతాడేపల్లి సర్పంచ్


సర్పంచ్ పోతుల అన్నవరం

తాడేపల్లిగూడెం రూరల్ : భారత గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం ఎంపికయ్యారు. జిల్లా నుంచి అన్నవరం ఒక్కరికే ఈ ఆహ్వానం అందడం విశేషం. పంచాయతీలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకోనున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఎంపికై నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వీరిలో ఎంపికైన వారు విశాఖపట్నం జిల్లా అంకంపాలెంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల్లో సెక్రటరీ సీహెచ్ రాజు, ఆర్గనైజర్ జి.శ్యామలాదేవి పాల్గొన్నారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన తనయ


తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె మంజూష

కామవరపుకోట: తండ్రికి తానే అన్నీ అయ్యి అంత్యక్రియలు నిర్వహించింది ఓ తనయ. వివరాల ప్రకారం.. కామవరపుకోట పంచాయతీ కొండగూడెంకు చెందిన కామా జయరాజు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. జయరాజుకు ముగ్గురు కుమార్తెలు సంతానం. కొడుకులు లేకపోవడంతో పెద్ద కుమార్తె మంజూష అన్నీ తానే అయ్యి తన తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

నేడు మార్టేరులో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పెనుమంట్ర: మార్టేరులో ఎస్వీజీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పురుషుల జట్టు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 2022, జనవరి 1న జన్మించిన క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో పాటు హాజరుకావాలని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు.

పత్తాలేని మెరైన్ పోలీస్ స్టేషన్

- నరసాపురం తీరంలో ఏర్పాటు అంటూ ఎప్పటికప్పుడు హడావుడి
- ఒక్క నిబంధనతో 14 ఏళ్లుగా ముందుకు కదలని ఫైల్
- 21 కిలోమీటర్లు తీరప్రాంతం ఉంటేనే మెరైన్ పోలీస్‌స్టేషన్
- నరసాపురంలో తీరం 19 కిలోమీటర్లు మాత్రమే


మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెబుతున్న నరసాపురం మండలం చినమైనవానిలంక తీరం

నరసాపురం: నరసాపురం తీరప్రాంతంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు అంశం పత్తా లేకుండా పోయింది. కొంతకాలం మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై హడావిడి చేయడం.. మళ్లీ విషయం మరుగున పడిపోవడం సర్వసాధారమైపోయింది. ఇక్కడి మెరైన్ స్టేషన్ అవసరంపై అధికారులు సర్వే చేసి కేంద్రం దృష్టిలో పెట్టినా ముందుకు కదలని పరిస్థితి.

పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి నరసాపురంలో మెరైన్ పోలీస్ స్టేషన్ అనుకుంటుండగానే, పక్క జిల్లా అంతర్వేదిలో మాత్రం మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు జరిగిపోవడం గమనార్హం.

ఆ మూడు కిలోమీటర్లు తక్కువవ్వడంతో..

నరసాపురంలో మైరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు 14 ఏళ్ల క్రితమే అంటే 2011లో దాదాపుగా రంగం సిద్ధం చేశారు. అప్పటి ఉమ్మడి పశ్చిమ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కూడిన ప్రతినిధి బృందం నరసాపురం తీరగ్రామాల్లో పర్యటించింది. నరసాపురం మండలం చినమైనవానిలంక, మొగల్తూరు మండలం పేరుపాలెం ప్రాంతాలు పరిశీలించారు. చినమైనవానిలంకలో ఓ ప్రాంతాన్ని స్టేషన్ ఏర్పాటుకు అనువుగా గుర్తించారు. అయితే మెరైన్‌పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలంటే ఖచ్చితంగా 21 కిలోమీటర్లు మించి తీరప్రాంతం ఉండాలనే నిబంధన ఒకటి కేంద్రం వద్ద ఉంది. మన జిల్లాకు సంబంధించి నరసాపురంలో 19 కిలోమీటర్లు మేర సముద్ర తీర ప్రాంతం అధికారికంగా ఉంది. మూడు కిలోమీటర్లు తీరప్రాంతం తక్కువయ్యింది. దీంతో అనూహ్యంగా ముందు ప్రతిపాదనలో లేని తూర్పు గోదావరిజిల్లా అంతర్వేదిలో మాత్రం 2013లోనే మెరైన్‌పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ మాత్రం పెండింగ్ పెట్టారు.

మధ్యలో మళ్లీ చిగురించిన ఆశలు

అంతర్వేదిలో మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు తరువాత ఇక నరసాపురంలో అలాంటి ప్రతిపాదనలు ఉండవని భావించారు. అయితే జిల్లాలో తీరప్రాంత గ్రామాలు ఎక్కువగా ఉండటంతో, మళ్లీ ఈ అంశం తెరమీదకు వచ్చింది. దానికి తోడు ముంబయ్‌లో సముద్ర మార్గం ద్వారా కసబ్‌తో సహా పలువురు తీవ్రవాదులు నగరంలోకి ప్రవేశించి మారణహోమం సృష్టించారు. సరిగ్గా అప్పుడే కేంద్రం మన రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాల్లో రక్షణ చర్యలపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా నరసాపురం తీరప్రాంతంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. స్థానిక అవసరాన్ని బట్టి తక్కువైన 3 కిలోమీటర్ల అంశాన్ని కూడా సవరించాలని నిర్ణయించారు. ఖచ్చితంగా ఇక్కడ మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు జరుగుతుందని అటు పోలీస్, ఇటు రెవెన్యూశాఖలు చెబుతున్నా.. పనిమాత్రం జరగడంలేదు.

ఉమ్మడి జిల్లాలో అవసరం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 19 కిలోమీటర్లు మేర తీరం ఉన్న ప్రాంతం నరసాపురం. తరచూ ప్రకృతి విపత్తులకు గురి కావడం వంటి ఇబ్బందుల రీత్యా ఇక్కడ మెరైన్ పోలీస్ స్టేషన్ అత్యంత అవసరమని నిపుణులు గుర్తించారు. మెరైన్ పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉంటే కేవలం తీరప్రాంత భద్రత, రక్షణ అనే కాకుండా ఇతర ఉపయోగాలుంటాయి. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ప్రాణహాని కలుగకుండా రక్షించడం మెరైన్ స్టేషన్ సిబ్బంది చేస్తుంటారు. బోట్లు, విపత్తు రక్షణ సామాగ్రి వారి వద్ద అందుబాటులో ఉండటం ఉపయోగంగా ఉంటుంది. సునామీ సమయంలోనూ, ప్రకృతి విపత్తుల సమయంలో జరిగిన ప్రమాదాల్లో అనేకమంది ఈ ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ మెరైన్ పోలీస్ స్టేషన్ అవసరాన్ని గుర్తించిన జిల్లా పోలీస్‌శాఖ అనేకసార్లు మెరైన్ పోలీస్‌స్టేషన్ అంశాన్ని కేంద్రం దృష్టిలో పెట్టింది. కానీ ఈ ఫైల్ మాత్రం పెండింగ్‌లోనే ఉండటం గమనార్హం.

స్థలం అందుబాటులో ఉంది



తీరంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి గతంలో ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ఇటీవల ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ఇక్కడ స్థల సమస్య అయితే లేదు. స్థలం కావాలంటే సేకరించి ఇవ్వొచ్చు. గతంలో గుర్తించామని చెబుతున్న చినమైనవానిలంకలో కూడా ప్రభుత్వ భూములు ఉన్నాయి. మళ్లీ ప్రతిపాదన వస్తే భూమి సేకరించి ఇవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు.

– దాసి రాజు, ఆర్డీవో, నరసాపురం

దమ్ము ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

నరసాపురం రూరల్: పంట చేలో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లవరం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాలకొల్లు మండలం వెలివిలి చినపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోతుమూడి వెంకటేశ్వరరావు (52) గురువారం మల్లవరం గ్రామంలో పంట చేలో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై టీవీ సురేష్, సీఐ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో డీవైఈవో రామన్న దొర గురువారం విచారణ నిర్వహించారు. ఫిజికల్స్ సైన్స్ ఉపాధ్యాయుడు మరీదు శ్రీహరిబాబు అప్పట్లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని విద్యార్థినులు, వారి తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీహరిబాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అయితే అప్పటి నుంచి శ్రీహరిబాబు సస్పెన్షన్‌లోనే ఉన్నారు. గురువారం ఈ ఘటనపై డీవైఈవో రామన్నదొర స్థానిక హైస్కూల్‌లో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీవైఈవో రామన్నదొర తెలిపారు.

కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలి

సీపీఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం


సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): కొల్లేరు ప్రజలకు నష్టం కల్గించే ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని, పర్యావరణంతోపాటు కొల్లేరు ప్రజల ఉపాధి కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం స్థానిక ఉద్దరాజు రామభవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొల్లేరు సమస్యపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరులో ఉన్న ప్రస్తుత సమస్యలు పరిష్కరించడం మానేసి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని, మూడో కాంటూరు దేవుడెరుగు ఐదో కాంటూరు నుంచి పది కిలోమీటర్లకు సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేసి పూర్తిగా అటవీ అధికారుల చేతుల్లో పెట్టబోతున్నారని విమర్శించారు. ఏలూరు జిల్లాలో కొల్లేటి ప్రాంతమైన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని 89 గ్రామాలపై ఈ ప్రభావం పడనుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో ఐదో కాంటూరు పైన పది కిలోమీటర్ల వరకు ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు చేయరాదని, కనీసం కట్టెల పొయ్యి కూడా వెలిగించడానికి వీలులేదని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు మినహా ఆ పరిశ్రమల విస్తరించుకోవడానికి గాని, కొత్త పరిశ్రమలు పెట్టడానికి గాని, భూగర్భ జలాలు వాడుకోవడానికి గాని ఎలాంటి అనుమతులు ఉండవని గుర్తు చేశారు. ఇలాంటి దారుణమైన 26 నిబంధనలను ప్రవేశపెట్టి కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాదిమంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ఇటీవల జిల్లా అధికారులు మండల కేంద్రాల్లో సభలు నిర్వహించి తూతూ మంత్రంగా అభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమన్నారు. తర్వాత గ్రామసభల నివేదిక ద్వారానే హద్దులు నిర్ణయిస్తామని చెప్తున్నారని, లైడార్ సర్వే జరుపుతున్నారు. అనంతరం గ్రామసభలు జరుపుతామని అధికారులు మాట మారుస్తున్నారన్నారు. తక్షణమే 89 గ్రామాల్లో గ్రామసభలు జరిపి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, జి.రాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, వివిధ మండలాల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్‌తో మొక్కజొన్న సాగు మేలు

పాడి-పంట


మెట్ట ప్రాంతంలో జీరో టిల్లేజ్ విధానంలో వేసిన మొక్కజొన్న పంట

చింతలపూడి: జీరో టిల్లేజ్‌తో మొక్కజొన్న సాగు చేపట్టడం వల్ల అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ వరి కోతలు ముగియగానే దుక్కి దున్నకుండానే ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. ఈ విధానం వల్ల రైతులకు ఖర్చు తగ్గడమే కాక, సమయం కూడా ఆదా అవుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల ఆదాయంతో పాటు నీటి వినియోగం తగ్గుతుంది. మెట్ట ప్రాంతంలో రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించి ఈ విధానాన్ని పాటిస్తున్నారు.

జీరో టిల్లేజ్ వల్ల ప్రయోజనాలు

జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు వల్ల నేలను తయారు చేయడం, భూమిని దున్నుకోవడం వంటి సమస్యలు ఉండవు. సమయం వృథా కాదు. వరి పంట కోసిన తరువాత భూమి ఆరుదలకు వచ్చి తిరిగి దుక్కి దున్ని మొక్కజొన్న పంట విత్తుకోవడానికి 15–20 రోజులు పడుతుంది. దీనివల్ల మొక్కజొన్నకు సీజన్ దాటిపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దిగుబడిపై పడుతుంది. ఈ విధానంలో పై సమస్యలను అధిగమించవచ్చు. ఈ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయాలంటే రైతులు కోతలకు ముందు వరిపైరుకు ఆఖరి తడి ఇవ్వకుండా ఆపాలి. భూమిలో పంట మొలకెత్తడానికి అవసరమైన తేమ ఉంటే చాలు. ఒకవేళ తేమ ఆరిపోతే రైతులు తేలికపాటి తడి పెట్టుకోవాలి. తాడు సహాయంతో 45 సెంటీమీటర్ల లోతులో లైన్లలో విత్తనాలను పెట్టుకోవాలి. బరువు నేలలైతే వరసల మధ్య 60 సెంటీమీటర్లు, తేలికపాటి నేలలైతే 20 సెంటీమీటర్ల దూరం పాటించాలి. నేలను దున్నకుండా సాగుకు దిగడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు 200 లీటర్ల నీటిలో 5.5 కేజీల అట్రాజిన్ పొడర్, లేదా 200 లీటర్ల నీటిలో 500 మి.లీ ప్యారాకాట్ కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వరి కొనలు చిగుళ్లు రావు. గడ్డి మొలవకుండా ఉంటుంది. విత్తనం విత్తిన తరువాత ఒకవేళ కలుపు వస్తే ఇదే పద్ధతి పాటించాలి.

ఎరువుల యాజమాన్యం

మొక్కజొన్న సాగుకు ఎకరాకు 96 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ అందించాలి. నత్రజనిని నాలుగు దఫాలు, పొటాష్‌ను రెండు దఫాలుగా పంటకు నీటి తడులు పెట్టే సమయంలో మొక్క మొదళ్లలో వేస్తే సరిపోతుంది. విత్తనాలు విత్తేటప్పుడు పక్కనే చిన్న రంధ్రం చేసి అందులో భాస్వరం, గుళికలు (డీఏపీ రూపంలో) వేసి కప్పాలి. మొక్కలు మొలిచిన 15–20 రోజులకు పైరుపై రెండు శాతం డీఏపీ ద్రావణాన్ని పిచికారీ చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. వీటితో పాటు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్లయితే మంచి ఫలితాలు సాధించవచ్చునని సహాయ వ్యవసాయ సంచాలకులు బి నాగకుమార్ తెలిపారు.


బి నాగకుమార్ - సహాయ వ్యవసాయ సంచాలకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు – మార్టేరు రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ లాల్ సాహెబ్ (55) గురువారం మృతి చెందాడు. పట్టణ ఎస్సై జి పృథ్వీ తెలిపిన వివరాలివి. మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన షేల్ లాల్ సాహెబ్ ఉల్లంపర్రులోని రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న లాల్‌సాహెబ్‌ను వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం షేక్ లాల్ సాహెబ్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు అబ్దుల్ రహీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఏలూరు పాతబస్టాండ్‌లో వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


ఏలూరు పాతబస్టాండ్‌లో యశ్వంత్ దీపు మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు పాత బస్టాండ్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. రక్తపుమడుగులో పడి ఉండడంతో తొలుత హత్యగా భావించినా అనారోగ్య కారణాలతోనే అతడు మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఏలూరు టూటౌన్ ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలివి. ఏలూరులోని ఇజ్రాయేల్‌పేటకు చెందిన యశ్వంత్ దీపు (30) విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు వయోవృద్ధుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి నాలుగేళ్ల క్రితం ఓ యువతితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పరస్పర అంగీకారంతో విడిపోయారు. రెండేళ్ల క్రితం దీపు మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన యశ్వంత్ దీపు అనారోగ్యం బారిన పడడంతో తీవ్ర మానసిక వ్యథకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తనకు ఆరోగ్యం సరిగాలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తెలిపి వెళ్లిపోయాడు. రాత్రికి కూడా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఏలూరు పాత బస్టాండ్‌లో గురువారం ఉదయం బస్టాండ్ స్వీపర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో కుర్చీల వెనుక ముఖంపై రక్తస్రావంతో ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ ఎస్సై రామకృష్ణ వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. నాలిక కర్చుకోవడంతో ముఖంపై రక్తస్రావం అయిందని ఒంటిపై ఇతర గాయాలు ఏమీ లేవని.. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

● అంజితో సావాసం



అంజి అని పిలిస్తే చాలు.. ఎక్కడున్నా టక్కున పరుగెట్టుకొస్తోంది ఆ వానరం (కోతి పిల్ల). ఆ చిన్నారులు ఏం చెబితే అది చేస్తోంది. వారు పెట్టింది తింటూ వారితోనే ఉంటోంది. ద్వారకాతిరుమలలోని పసరుకోనేరు వద్ద చెట్టు కింద బుడగలు అమ్ముకునే ఒక కుటుంబం కొద్దిరోజులుగా ఆవాసం ఉంటోంది. ఆ కుటుంబంలోని నలుగురు చిన్నారులు, ఒక వానరం పిల్లతో జత కట్టారు. ఆ వానరం తమతో ఉంటూ, తమతో పాటే తింటుందని అంటున్నారు.

– ద్వారకాతిరుమల

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ఘటనా స్థలంలో రోదిస్తున్న స్నేహితుడు, మృతుడు క్రాంతికుమార్ (ఫైల్)

హనుమాన్ జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం పమిడికుంట గ్రామానికి చెందిన నక్కా క్రాంతికుమార్ (25), తన మిత్రుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనానికి లారీ తగలటంతో అదుపు తప్పి ఇద్దరు యువకులు రోడ్డుపై పడిపోయారు. ఈ క్రమంలో క్రాంతికుమార్ తలపై లారీ వెనుక టైర్లు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు బైక్ హుషారుగా నడిపిన క్రాంతి కుమార్ క్షణాల్లో కళ్ల ముందే విగతజీవిగా రక్తపు మడుగులో పడి పోవటంతో బైక్‌పై ఉన్న అతని స్నేహితుడి శోకం అరణ్యరోదనగా మారింది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరుల శిక్షణా కేంద్రం ద్వారా కషాయాలు తయారు చేస్తూ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఒబిలిశెట్టి గోపాలకృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు లభించింది. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు గోపాలకృష్ణమూర్తి చేస్తున్న కృషిని 'వ్యవసాయం కోసం అంతర్జాతీయ యోగ్యత కేంద్రం' వారు గుర్తించారు. బుధవారం బెంగుళూరులో యోగ్యతా కేంద్రం ప్రతినిధులు గోపాలకృష్ణమూర్తికి జైవిక్ ఇండియా అవార్డు–2025ను అందజేశారు.

క్లుప్తంగా

రెండో రోజు ప్రశాంతంగా జీఈఈ పరీక్షలు



వాసవీలో జేఈఈ మెయిన్ పరీక్ష హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా గురువారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఉదయం పరీక్షకు 219 మందిగాను పరీక్షకు 217 మంది హాజరయ్యారు. సాయంత్రం జరిగిన పరీక్షకు 222 మందికి గాను 220 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, చీఫ్‌కో –ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులంలో సామాజిక తనిఖీ గ్రామసభ



పెదతాడేపల్లి గురుకులంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ డీఆర్‌పీలు బి.యోగానంద్, జి.చంద్రబాబులు విద్యార్థుల భోజన వసతి, హాస్టల్, ఉపాధ్యాయ, ఇతర సిబ్బంది ఆరోగ్య, ఆర్థిక అంశాలపై తనిఖీని వివరించారు. తల్లిదండ్రులు వారు చెప్పిన విషయాలను సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కే.ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ కే.సీహెచ్. ఇందిర, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై అవగాహన అవసరం



జగన్నాథపురంలో పాడి రైతులకు మినరల్ మిక్చర్‌ను అందజేస్తున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ రైతులు క్రమం తప్పకుండా పాడి పశువులకు టీకాలు వేయించాలన్నారు. తద్వారా వ్యాధుల నుంచి పాడి పశువులను రక్షించుకోవచ్చన్నారు. నందమూరు పశువైద్యాధికారి డాక్టర్ వి.సునీల్ కుమార్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టల నివారణ, టీకాలు వేయించాలన్నారు. అనంతరం 112 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, ప్రకాష్ సువర్ణరాజు, వెంకటేష్, పోసిబాబు, మహేష్, చిట్టియ్య, శ్రీను, సునీల్, పాండు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



శశి విద్యార్థులలకు రోడ్డు భద్రతపై అవగాహన

తాడేపల్లిగూడెం: జాతీయ రహదారి భద్రత నియామాలు ప్రతి ఒక్కరూ పాటించాలని పలువురు వక్తలు తెలిపారు. ఈ సందర్భంగు జాతీయ రోడ్డు భద్రతా సంస్థ, శశి కళాశాలలో ఏబీఎఫ్ సంస్థ సంయుక్తంగా గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఉంగుటూరు టోల్ మేనేజర్ ఇంతియాజ్, ఏబీఎఫ్ ఫౌండర్ ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. శశి సంస్థ బాధ్యులు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మేకా నరేంద్రకృష్ణలు అభినందనలు తెలిపారు.

దాబా నిర్వాహకుడి అరెస్టు



దాబా నిర్వాహకుడుని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక దాబా వద్ద మద్యం సేవించేందుకు అనుమతినివ్వడంతో దాబా నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. అతని వద్ద నుంచి రెండు లూజు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది ఉన్నారు.

మోతాదు మించితే అనర్థమే

- భూసారానికి తీవ్ర నష్టం
- చీడపీడల వ్యాప్తికి దోహదం
- ప్రజారోగ్యానికి చేటు



పొలంలో నాట్లు వేస్తున్న రైతులు



వరి పొలాలు

ఇరగవరం: అతి అన్నింటా అనర్థమే..సాగులో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తే మొదటికి మోసమే..అధిక దిగుబడి వస్తుందనే అభిప్రాయంతో చాలామంది రైతులు ఎరువులను అధిక మొత్తంలో వాడడంతో భూములు సారం కోల్పోవడంతో పాటు మనుషుల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు, పెట్టుబడి వ్యయం కూడా తగ్గించుకోవచ్చునని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రబీ సాగులో ఎరువులు ముఖ్యంగా నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని, అధికంగా నత్రజని వాడటం వల్ల నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో 48,883 ఎకరాల్లో రబీ సాగు

తణుకు నియోజకవర్గంలో సుమారు 48,883 ఎకరాల్లో రబీ వరిసాగు జరుగుతుండగా, ఇరగవరం మండలంలో సుమారు 11,713 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తున్నారు. సుమారు 70 శాతం భూముల్లో వరినాట్లు పూర్తి కాగా, మిగిలిన వాటిలో సంక్రాంతి లోపు నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంది. ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే మొదటి విడత ఎరువులు వేయడం పూర్తి చేసి రెండో విడత ఎరువులు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. రైతులు ముఖ్యంగా వరి మొక్కల ఎదుగుదలకు అవసరమైన నత్రజనిని అందించే యూరియా ఎరువులను అధికంగా వాడుతున్నారు. చాలామంది రైతులు అవగాహనా లోపంతో అవసరానికి మించి అధికంగా యూరియా వాడుతూ నష్టపోతున్నారు. నత్రజని ఎరువు అధికంగా వాడటంవల్ల పంటలపై చీడపీడలు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంటుంది. తెగుళ్లు ఆశిస్తే రైతులు పురుగుమందులకు ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వరిలో కొన్నేళ్లుగా ఎండాకు తెగులు ఆశించడంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఇందుకు నత్రజని ఎరువుల అధిక వాడకమే కారణమని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు.

నియోజకవర్గంలో రబీ సాగు (ఎకరాల్లో)	
మండలం	రబీ సాగు లక్ష్యం
తణుకు	21,173
తణుకు రూరల్	11,713
ఇరగవరం	5,328
అత్తిలి	10,669
మొత్తం	48,883

పరిమితికి మించి ఎరువుల వినియోగంతో నష్టాలివీ

- వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు వాడాలి
- నత్రజని ఎరువుల అధిక వాడకం వల్ల భూసారం దెబ్బ తింటుంది.
- పంటలపై చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. పెట్టుబడులు పెరుగుతాయి. నీటి వినియోగం పెరుగుతుంది.
- పంట దిగుబడి తగ్గుతుంది. పంట నాణ్యత కోల్పోతుంది.
- పైరు త్వరగా ఎదిగి కొద్దిపాటి గాలికే పడిపోతుంది.
- వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- ఎండాకుతెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం



కొన్నేళ్లుగా రైతులు అవసరం మేరకే ఎరువులను వాడుతున్నారు. ఎరువుల అధిక వినియోగం వల్లన కలిగే నష్టాలపై రైతులకు అవగాహన వచ్చింది. రబీ పైరుకు నత్రజని (యూరియా) ఎరువు సుమారు 80 కిలోలను మూడు సమ భాగాలుగా మూడు దఫాలుగా వేయాలి. సూపర్ సింగిల్ పాస్ఫేటు 100 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలి. పొటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలి. కాంప్లెక్స్ (భాస్వరం) ఎరువులు పైపాటుగా వేయవద్దు. అలావేస్తే మొక్కలు గ్రహించవు. యూరియాను వేసే ముందు నీటిని తీసివేసి, బురద పదునులో వేయాలి. 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. నత్రజనితో పాటు కలుపు మందులు కలపరాదు.

– రాఘవేంద్రరావు, ఇరగవరం మండల వ్యవసాయ అధికారి.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణపై తక్షణ చర్యలు తీసుకోవాలని, బోర్డులో వివిధ సంక్షేమ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం సీపాయి పేటలోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు అధ్యక్షత వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరణ జరుగుతుందని కూటమి నాయకులు చెప్పారని, ఆ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపటడం లేదని, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. మాజీ ఐఏఎస్ అధికారులతో కమిటీ వేస్తామని కార్మిక మంత్రి హామీ ఇచ్చారని ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, నాయకులు ఓసూరి వీర్రాజు, మండలపర్తి హరీష్, దువ్వా శ్రీను, అంకం భాస్కర్‌రావు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆదర్శనీయుడు



తణుకులో చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బోస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తణుకు అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవన విధానం ఆదర్శనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటి యువత బోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బోస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పొట్ల సురేష్, గొల్లపల్లి అంబేడ్కర్, ఎంఎంఆర్ఎం శ్యామ్, కుటుంబరావు, జ్యోతి బాబు, పొట్ల విజయకుమార్, బి.విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో గురువారం పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దివ్యాంగుల పిల్లలకు డ్రాయింగ్, బుక్స్, స్నాక్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు దేశభక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. చంద్రబోస్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. సభ్యులు ఆంజనేయస్వామి, వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.చంద్రకుమారి, ఎస్‌కే బాలీశ్వరయ్య, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకొని మనందరం ఆయన అడుగు జాడల్లో పయనించాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సుభాష్ చంద్ర బోస్ 128వ జయంతిని పురస్కరించుకొని స్థానిక నేతాజీనగర్‌లోని ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గట్టిం మాణిక్యాలరావు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కోట రాంబాబు,తాతా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తణుకు మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ (ఎంవీఐ) ఎస్.శ్రీనివాస్ అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తణుకు ప్రగతి జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారులపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ముఖ్యంగా కళాశాలల బస్సుల డ్రైవర్లు నిర్లక్ష్యాన్ని వీడాలని, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తనతోపాటు విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితులు ఏర్పడతాయనే విషయాన్ని గుర్తెరగాలని కోరారు. డ్రైవర్లు మంచి ఆహార అలవాట్లను పాటిస్తూ సమయానికి నిద్రించేలా పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రగతి రాజా, డ్రైవింగ్ శిక్షకుడు కె.మురళి, విద్యార్థులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పకుమారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యం, చిన్నచూపు కారణంగానే మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. పట్టణంలోని కపర్ధి భవన్‌లో గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ పసిపిల్లలు నుంచి వృద్ధులు వరకు అత్యాచారాలు, హత్యలకు గురవుతున్నారని, మహిళల రక్షణకు చేసిన చట్టాలు సమర్ధవంతంగా అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు అమోదించిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు అమలు జరపడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగలక్ష్మి, వడ్డాది మేరీ, ప్రసన్న, బి.స్వర్ణకుమారి, జే.సీత, కె.సత్యవతి, సురేఖ, ప్రభ, పద్మలు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో ?

- గ్రంథాలయం కోసం ఎదురుచూస్తున్న చదువరులు
- కాంపిటేటివ్ పరీక్షల కోసం విద్యార్థుల తహతహ



తణుకు బ్యాంక్ కాలనీలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనం

తణుకు అర్బన్: తణుకు బ్యాంక్ కాలనీలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనం నిర్మాణం జాప్యం కావడంతో చదువరులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు 90 శాతం పూర్తైనా నిధులు విడుదల కాని నేపథ్యంలో పనులు నిలిపినట్లుగా తెలుస్తోంది. 2024వ సంవత్సరం జనవరిలో ప్రథమశ్రేణి గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1.03 కోట్లు గ్రంథాలయ సంస్థ నిధులతో అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ చేతులమీదుగా శంఖుస్థాపన చేయగా పనులు మొదలు పెట్టారు. అయితే భవన నిర్మాణ పనులు చివరి దశకు వచ్చినా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కరూపాయి కూడా బిల్లులు చేయకపోవడంతో పనులు నిలిచిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని చదువరులు ఎదురుచూపులు చూస్తున్నారు.

నిత్యం వందకిపైగా చదువరులు..

తణుకు బ్యాంక్ కాలనీలో ఉండే గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మాణ క్రమంలో గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు తాత్కాలికంగా తణుకు సొసైటీ రోడ్డులోని రాజీవ్‌గాంధీ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్థులో ఏర్పాటుచేశారు. మొదటి నుంచి గ్రంథాలయ భవనం బ్యాంక్ కాలనీలో ఉండడం ఆ ప్రాంతవాసులు అధికంగా గ్రంథాలయానికి వస్తుండేవారు. సుమారుగా నిత్యం వందకుపైగా చదువరులు వచ్చే ఈ గ్రంథాలయంలో అధికంగా విద్యార్థులు వివిధ కాంటేటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సంబంధిత పుస్తకాల పఠనం కోసం వచ్చేవారు. కానీ గ్రంథాలయ భవనం మార్చడంతోపాటు రెండో అంతస్థులో ఏర్పాటు చేయడం వలన చదువరుల సంఖ్య క్రమేపి తగ్గింది. ముఖ్యంగా వృద్ధులు గ్రంథాలయ భవనంలోకి వెళ్లాలంటే పైకి ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. కావున బ్యాంక్ కాలనీలోని నూతన గ్రంథాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని చదువరులు కోరుతున్నారు.

కార్మిక హక్కులపై పోరాటం చేద్దాం



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ చేస్తున్న నాయకులు, కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉద్యోగ, కార్మిక వర్గాలపై కేంద్ర ప్రభుత్వం పని గంటలు పెంచాలని దుర్మార్గమైన ఆలోచనను కార్మిక వర్గం తిప్పికొట్టాలని, కార్మిక హక్కులను కాపాడుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ పిలుపునిచ్చారు. శేషమహల్ సెంటర్‌లో గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జాతీయ కమిటీ వేసిన కార్మిక హక్కులను కాపాడుకోవాలని విడుదల చేసిన కరపత్రాలను ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. వరప్రసాద్ మాట్లాడుతూ ఎనిమిది గంటల పని హక్కులపై ఒక వైపు ప్రభుత్వాలు, మరొవైపు కార్పొరేట్ శక్తులు దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికవర్గ హక్కులపై దాడులు జరుగుతున్నాయని, ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఉదయరాజు, రాము, ఆసిన్‌బాష, సత్యనారాయణ, కోటేశ్వరరావు, నూకరాజు, కృష్ణ పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ అందజేత



పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్ అందజేస్తున్న ఐడీబీఐ బ్యాంక్ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడానికి వీలుగా గురువారం ఐడీబీఐ బ్యాంక్ తాడేపల్లిగూడెం బ్రాంచ్‌వారిచే 8 కంప్యూటర్లు, ఒక ప్రింటర్ అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం మైనం సత్యనారాయణ బ్యాంక్ యాజమాన్యంనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఏలూరు మేనేజర్ వి.శ్రీనివాసరావు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయం



మంచిలిలో మానవతా సేవా సంస్థ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరిమిల్లి

అత్తిలి: సామాజిక సేవా కార్యక్రమాలలో మంచిలి భగవాన్ పూతరేకుల సంస్థ పాలుపంచుకోవడం అభినందనీయమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో భగవాన్ పూతరేకుల సంస్థ అధినేత శిరగాని నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఎమ్మెల్యే చేతులు మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయ ధూపదీప నైవేధ్యాల నిర్వహణకు రూ. 2లక్షలు, శ్రీపెద్దింట్లమ్మ ఆలయానికి రూ. 2 లక్షలు, అత్తిలి మండల మానవతా సేవా సంస్థ శాంతిరథం కొనుగోలు నిమిత్తం లక్ష రూపాయలు, గ్రామంలో ఆదరణలేని పేద వారికి రూ. 2500లు చొప్పున నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, హైస్కూల్ విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలోని తణుకు, పైడిపర్రు, అత్తిలి, కొమ్మర సబ్‌స్టేషన్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సజ్జాపురం, రామకృష్ణమఠం, ఆపిల్ హాస్పిటల్, బీపీఎల్ షోరూం నుంచి నరేంద్ర థియేటర్ వరకు, తణుకు మండల పరిధిలోని పైడిపర్రు, మండపాక గ్రామాల్లోని ఇండస్ట్రియల్ సర్వీసులకు, అత్తిలి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయిన్ రోడ్డు ఫీడర్, గొల్లగూడెం ఫీడర్, రైల్వే ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 24వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వన్ టౌన్‌లోని మెయిన్ రోడ్డు, గొల్లగూడెం సెంటర్, నందిబొమ్మ సెంటర్, శేషమహల్ రోడ్డు, నల్లజర్ల రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నరసింహమూర్తి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సత్యసాయిబాబు 100వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా నిరుద్యోగ యువతులకు హైదరాబాద్ వారి సహకారంతో కుట్టుశిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు జనార్ధనరావు, మల్లిఖార్జునరావు, నవీన్‌బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం నుంచి ఈశిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అర్హులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తూడు తొలగింపు పనుల పరిశీలన

కాళ్ల: సుమారు 10 గ్రామాలకు సాగు తాగునీరు అందించే బొండాడ పంట కాలువలో తూడు, చెత్త తొలగింపు పనులను చేపట్టినట్లు ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు తెలిపారు.